క్లుప్తంగా

దివ్యాంగునికి వైద్యశాలకు వెళ్లి పెన్షన్ పంపిణీ



నిమ్మకూరు(పామర్రు): మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నిమ్మకూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు ప్రసాద్‌కు గ్రామానికి చెందిన వలంటీర్ దాసరి రత్నకుమారి గురువారం మచిలీపట్నం వెళ్లి పింఛను అందజేసింది. దీంతో ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు వలంటీర్ రత్నకుమారికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



గుడ్లవల్లేరు: గురువు అందించే విద్యతోనే సమాజంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని అంగలూరు ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డైట్‌లో 16 మంది అధ్యాపకులకు ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ వారు సన్మానం చేశారు. వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షుడు లోయ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు అర్జా ప్రసాద్, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



గుడివాడటౌన్: స్థానిక 31వ వార్డులో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవరాత్రి మహోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వంగలపూడి కనకబాబు, వీరిశెట్టి నరసింహరావు, శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు, పంచకర్ల వెంకట్, పి.బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

గుడివాడటౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని 1, 2, 3, 7, 9, 10, 11, 36 వార్డులలో శుక్ర, శనివారాలు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ రిజర్వాయర్ వద్ద అమృత్ ఫేజ్–1 పథకం అమలులో భాగంగా డిస్ట్రిబ్యూషన్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టినందున ఈ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీని వలన గౌతమ్ స్కూల్, లింగవరం రోడ్, నాగవరప్పాడు, వైఎస్సార్ కాలనీ, వాసవీనగర్, కొత్తపేట, కుమ్మరి చెరువు, వలివర్తిపాడు రోడ్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

కానుకొల్లులో గ్రామసభ

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో గురువారం సర్పంచ్ నాగదాసి థామస్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. సంవత్సరానికి నాలుగు పర్యాయాలు గ్రామసభలు జరుగుతాయి. ఇందులో భాగంగా కానుకొల్లులో గురువారం గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు తదితర విషయాలపై చర్చించారు. కార్యదర్శి పి.రత్నకుమారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సు

గుడివాడ టౌన్: గుడివాడ డివిజన్ పరిధిలోని నందివాడ, పెదపారుపూడి, గుడివాడ రూరల్ మండలాల రైతు భరోసా కేంద్రాలలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ నిమ్మగడ్డ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పొలాలను బట్టి ఎకరాకు 192 గ్రాముల నూకలు, 4 గ్రాములు వేరుశనగ నూనె రైతు భరోసా కేంద్రాల వద్దకు తెస్తే 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును గ్రామ వ్యవసాయ సహాయకులు కలిపి ఇస్తారన్నారు. ఎలుకల నివారణ కోసం పొలం గట్లు, కాల్వగట్లు, ఎలుకలు సంచరిస్తున్న ప్రాంతాలను గమనించి వాటిని ఒకేసారి చల్లి సామూహిక ఎలుకల నివారణకు రైతులు సహకరించాలని కోరారు.

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు

జురువరం(పామర్రు): ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. మండలంలోని నిమ్మకూరు పీహెచ్‌సీ పరిధిలోని జురువరం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఈవో జ్యోతిబసు పాల్గొని ఆరోగ్య పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఎంతోమంది మెరుగైన ఆరోగ్య సేవలు పొందుతున్నారని అన్నారు. ఈ ఆరోగ్య క్యాంపులను వినియోగించుకుని ప్రతి ఒక్కరు ఆరోగ్య వంతులుగా మారాలని అన్నారు. అనంతరం శిబిరంలో జరిగిన వైద్య పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ, ఎంపీడీవో వై.రామకృష్ణ, నిమ్మకూరు పీహెచ్‌సీ వైద్యులు అమీర్, రఘురామ్, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి పద్మశ్రీవేణి, స్థానికులు కుర్చేటి ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



జురువరంలో ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తున్న సీఈవో జ్యోతిబసు, ఎంపీపీ అశోక్‌కుమార్



గుడ్లవల్లేరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



చినపారుపూడిలో జగనన్న సురక్ష కిట్‌లను లబ్ధిదారునికి అందజేస్తున్న ఎంపీపీ గోగం సురేష్

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

గుడ్లవల్లేరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేద ప్రజలకు మేలు చేకూరుతుందని ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద విన్నకోటలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న 334 మందికి వైద్యులు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, డీటీ బి.కనకదుర్గ, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐనంపూడిలో 554 మంది రోగులకు పరీక్షలు

పమిడిముక్కల: ఐనంపూడి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ యేనుగ బేబి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ ప్రారంభించారు. జనరల్, గైనిక్, ఈఎన్‌టీ, కంటి వెలుగు వార్డుల్లో వైద్యులు బాలాజీ, అఖిల రోగులను పరీక్షించారు. 554 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్ వైద్య శిబిరాన్ని సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ విఠల్‌పాల్, ఈవోఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి, కార్యదర్శి విజయదుర్గ, హెల్త్ సూపర్‌వైజర్ బి.వెంకటేశ్వరరావు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యేనుగ వెంకటేశ్వరరావు, బొల్లా సాంబశివరావు, తిరుమలశెట్టి బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు

చినపారుపూడి: ప్రతి ఇంటికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటుచేశారని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండలంలోని చినపారుపూడి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ క్యాంపులో బీపీ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి మూల్పూరి హరీష, సర్పంచ్ నగుళ్ళ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సగ్గుర్తి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

కైకలూరు: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నెలకొల్పడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని దొడ్డిపట్ల సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు ఆధ్వర్యంలో గ్రామ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే డీఎన్నార్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సేవలో ఇదొక నూతన అధ్యాయం అని కొనియాడారు. ఇతర రాష్ట్రాలు సైతం సీఎం ప్రవేశపెడుతున్న పథకాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయడానికి ముందుకొస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భత్రాజు శివాజీ, ఎంపీటీసీ కరణం వెంకటలక్ష్మీదుర్గా శ్రీదేవి, ఉప సర్పంచ్ నాగనబోయిన సురేష్, సర్పంచులు గరికిముక్కు మరియమ్మ, జయమంగళ కాసులు, ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో చంద్రశేఖర్, తహసీల్దారు మురళీకృష్ణ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వైద్యులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దొడ్డిపట్లలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ముదినేపల్లిరూరల్: రాష్ట్రంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలందించేందుకు ముఖ్యమంత్రి జగనన్న వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పేరూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా స్థిరపడడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పేద కుటుంబం రూ.లక్షల్లో విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చన్నారు. అనంతరం వైద్య శిబిరంలో వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, సర్పంచ్ పుట్టి మాధవి, ఎంపీటీసీ కోటే ప్రవీణ్, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, ముదినేపల్లి, దేవపూడి, గురజ, పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని చింతపాడు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డీఎన్నార్ పాల్గొని వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని వైద్యసేవలు పొందాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్సీ జయమంగళ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వైద్యసేవలు పొందాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. చింతపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ జయమంగళ లక్ష్మీవీర్రాజు, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, పెనుమాకలంక సర్పంచ్ ముంగర నాగరాజు, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, జయమంగళ వీర్రాజు, ఎం.ఏడుకొండలు, జి.విష్ణుమూర్తి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీఓ సీకే వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఆనందబాబు, డీఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రుకు చేరిన జిలానీ బాషా పాదయాత్ర



పామర్రు: మార్కాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు షేక్ జిలానీ బాషా చేస్తున్న పాదయాత్ర గురువారం పామర్రుకు చేరుకుంది. స్థానిక శాసనసభ్యుడు కైలే అనిల్ కుమార్ కార్యాలయంలో ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా జ్ఞానమణి మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలలో అఖండ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆశిస్తూ బాషా చేస్తున్న యాత్ర విజయవంతం అవ్వాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. అనంతరం బాషాను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ పల్లికొండ రత్నకుమారి, ఉండ్రపూడి వీరాంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ కుందేటి రాణి పాల్గొన్నారు.

శరన్నవరాత్రి మహోత్సవాల రాటా ఏర్పాటు



గుడివాడటౌన్: స్థానిక 8వ వార్డు పెద్దవీధిలో ఉన్న శ్రీ వడ్డపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో గురువారం రాటా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి దేవస్థానంలో శ్రీ దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. నవరాత్రి మహోత్సవాల పనులు ప్రారంభ సూచికగా రాటా ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు వల్లూరిపల్లి సుధాకర్, కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, ఆలయ నిర్వాహకులు ధనాల సత్తెమ్మ, వెంకటరత్నారావు, లక్ష్మి, సత్యన్నారాయణ, ఫణి, బుజ్జి, శ్రావణి, డాక్టర్ శ్రీను, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక పాల ఉత్పత్తికి కృషి చేయాలి

పెరిశేపల్లి(పామర్రు): పాల ఉత్పత్తిదారులు ఉత్పత్తిని పెంపుదల చేసేందుకు తగు విధంగా కృషి చేయాలని విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని పామర్రు పాల శీతల కేంద్రం పరిధిలోని జురువరం, పెరిశేపల్లి గ్రామాల్లోని పాల సేకరణ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాల సేకరణ కేంద్రాలను పరిశీలిస్తూ, పాల రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాడిలో ఎటువంటి మెలకువలు పాటిస్తే అధిక పాల దిగుబడి వస్తుందనే అంశాలను వివరిస్తున్నామన్నారు. సబ్సిడీలపై అందజేసే దాణా తదితరాలను పశువులకు మేపడం వలన వెన్న శాతం పెంపొందుతుందని సూచించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పాలక వర్గ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, జిల్లా ట్రస్టుబోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి కృష్ణమోహన్, పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీచంద్, సూపర్‌వైజర్ ఎండీ బాషా, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తిదారులతో మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని

ఉపాధ్యాయులకు సత్కారం



ముదినేపల్లి రూరల్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలువురు ఉపాధ్యాయులను ముదినేపల్లిలో గురువారం సత్కరించారు. మండలంలో విద్యాభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన సచేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 1998 క్వాలిఫైడ్ ఉపాధ్యాయులైన సీహెచ్ ఇజ్రాయిల్, హేరీస్, మాధవీలత, ఉమాదేవి, మండల ఉత్తమ ఉపాధ్యాయులు డి.వెంకటరత్నం, డీవీ నరసయ్యను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఘనంగా విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

పామర్రు: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక హితమ్ స్కూల్‌లో ఘంటసాల కళాపీఠం సభ్యుల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల అనుభవాలను నేటి తరం ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులైన గుమ్మడి వెంకటేశ్వరరావు, రాణి, వి.నాగస్వామి, సత్యవర ప్రసాద్, జక్కరయ్య, యు.రాజాబాబు, కె.నాగమల్లేశ్వరమ్మలను ఘనంగా పుష్పమాలలతో శాలువాలను కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పరిశ వెంకట నాంచారయ్య, గురుస్వామి, హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ నందిపాటి హేమంత్‌రెడ్డి, సుబ్బమ్మ, పార్వతి, సాల్మన్ కొల్లాబత్తుల తదితరులు పాల్గొన్నారు.

పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

మండలంలోని జమీదగ్గుమిల్లిలో పామర్రు లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో హైస్కూల్ హెచ్‌ఎం టీఎస్ హను ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు పీఎంఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు సీహెచ్ అరసవల్లి రావు, బి.వీర పద్మ, పి.గుణలక్ష్మి, సత్యప్రభ పాల్గొన్నారు.



పామర్రులో విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు

ఘనంగా 31 అడుగుల మట్టి గణపతికి పూజలు

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 31 అడుగుల మట్టి వినాయక ప్రతిమ గత 21 రోజులుగా భక్తులతో విశేషంగా పూజలందుకుంటోంది. ఇందులో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గణపతి హోమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గోపూజ, నిత్యపూజ, గణపతి పంచాయతన, నవగ్రహ శాంతి హోమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. దాతల సౌజన్యంతో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 8వ తేదీ ఆదివారం ఆలయ వినాయక స్వామికి విశేషంగా పుష్పాలంకరణ కార్యక్రమం జరుగుతుందని, అనంతరం స్వామివారి నిమజ్జనోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అందరూ తప్పనిసరిగా పాల్గొని స్వామివారి విశేష పూజ నిమజ్జనోత్సవాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి అప్పల రామారావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో పూజలందుకుంటున్న పామర్రులోని 31 అడుగుల మట్టి వినాయక స్వామి ప్రతిమ

క్రీస్తు బోధనలను అందరూ అనుసరించాలి

పామర్రు: ప్రభువైన ఏసుక్రీస్తు బోధించిన బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని వైఎస్సార్‌సీపీ కృష్ణాజిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డు నాగులేరు గట్టు వద్ద మరనాత వారి ఉజ్జీవ సువార్త స్వస్థత శాలలో నిర్వహిస్తున్న ఉపవాస కూడిక కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ పల్లికొండ రత్నకుమారి, ఉండ్రపూడి వీరాంజనేయ స్వామి దేవస్థానం డైరెక్టర్ కుందేటి రాణి, స్వస్థత శాల నిర్వాహకులు, ప్రభువు సేవకులు, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక ఆలయంలో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగేశ్వరపేట పురనివాసిని శ్రీ పర్వతవర్ధని అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన జరుగుతాయన్నారు. 15 తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరపూజతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15వ తేదీ ఆదివారం అమ్మవారు శ్రీపర్వతవర్ధని దేవి, సోమవారం శ్రీబాలా త్రిపురసుందరీదేవి, మంగళవారం శ్రీఅన్నపూర్ణదేవి, బుధవారం శ్రీమహాలక్ష్మీదేవి, గురువారం శ్రీలలితా త్రిపురసుందరీదేవి, శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు శ్రీసరస్వతీదేవి, శనివారం మహిషాసురమర్దిని దేవి, ఆదివారం శ్రీ రాజరాజే శ్వరి దేవి అలంకారంలో పూజలు అందుకుంటారన్నారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. 23వ తేదీ సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం శమీపూజ 24వ తేదీ మంగళవారం అన్నప్రసాద వితరణ జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి సున్నపు లక్ష్మీనరసారెడ్డి, కోశాధికారి కూచిభొట్ల పూర్ణయ్యశాస్త్రి, మోతే దుర్గారావు, డి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బల్లిపర్రు గురుకుల విద్యార్థినులు

పెడన: రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యార్థినులు ఎంపికయ్యారని పెడన మండలం బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ గురువారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన విజయవాడలోని పీబీ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగం బాలికల వాలీబాల్, త్రోబాల్ పోటీలు జరిగాయి. ఇంటర్ విద్యార్థినులు పీఎస్‌వీటీ ప్రియ, కె. అనుష్క, త్రోబాల్‌లో కె. బిందు, ఎం. ప్రవల్లిక, కె. అనుష్క, పీవీఎస్‌టీ ప్రియ రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సాధించారని వివరించారు. విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయినులు పి. మాధవి, టి. ప్రశాంతిని అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో బల్లిపర్రు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కలెక్టరేట్ ప్రాంగణం సుందరీకరణకు ప్రణాళిక

కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నంటౌన్: కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్వో పి. వెంకటరమణతో కలిసి పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన ఈ అంశంపై సమీక్షించారు. కలెక్టరేట్‌లోకి అడుగుపెడితే ప్రజలకు మంచి భావన కలిగేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. ప్రతి కార్యాలయానికి వెళ్లేందుకు సరైన అంతర్గత రహదారులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీ పటిష్టంగా ఉండాలని, ప్రధాన ప్రవేశమార్గం వద్ద హోంగార్డును నియమించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా పచ్చనితోట, ప్రజలు కూర్చునేందుకు సౌకర్యంగా బల్లలు, పార్కింగ్ ప్రదేశాలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలో నూతన కాన్ఫరెన్స్ హాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు.